
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 28.0 | కనిష్ఠం : 22.0
ANDHRAJYOTHY
5
జోగులాంబ గద్వాల జిల్లా వార్తలు
మంగళవారం 2 సెప్టెంబరు 2025



శశివర్ణం చతుర్భుజం

వనపర్తి పట్టణంలో సాయినగర్ కాలనీలో పూజలందుకుంటున్న గణనాథుడు



6

విమర్శకులకు అందని సురవరం

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి
- కుగ్రామంలో పుట్టి ఆకాశమంత ఎత్తుకు ఎదిగిన నేత
- ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్



'ఎర్రపొద్దై మళ్లీ వస్తవా వీరుడా' సీడీని ఆవిష్కరిస్తున్న నాయకులు

అలంపూరు చౌరస్తా, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విమర్శకులకు అందని నాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. సోమవారం సురవరం స్వగ్రామమైన జోగుళాంబ గద్వాల జిల్లాలోని కంచుపాడులో సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సభకు రెండు తెలుగు రాష్ట్రాల వామపక్ష ముఖ్య నాయకులు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బాలనరసింహ, ఉమ్మడి జిల్లా కార్యదర్శులు, ప్రజలు హాజరయ్యారు. నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ 60ఏళ్ల పాటు ఎర్ర జెండాను మోసిన ఆయన అందరూ మెచ్చే నాయకుడిగా ఎదిగారని అన్నారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ మాట్లడుతూ.. కుగ్రామంలో పుట్టి ఆకాశమంత ఎత్తుకు ఎదిగిన మహోన్నీయుడు సురవరం అని అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. కంచెపాడు గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.3కోట్ల నిధులు, గ్రామంలో పాఠశాలను హైస్కూలుగా అప్‌గ్రేడ్ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకు సంబంధించిన జీవోలను సురవరం సతీమణి విజయలక్ష్మికి అందజేశారు. అదేవిధంగా గ్రామంలోని ఐదుగురికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాలను అందజేశారు. సురవరం సతీమణి విజయలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తరపున సంపత్‌కుమార్ వచ్చి గ్రామాభివృద్ధి జీవో కాపీలను అందజేయడం శుభపరిణామం అని అన్నారు. రచయిత శ్యామల రాసిన 'ఎర్రపొద్దై మళ్లీ వస్తవా వీరుడా.. ఎర్రజెండాను అలుముకుంటావా' అనే పాట సీడీని నాయకులు విడుదల చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం తదితరులు ఉన్నారు.

కూలీలకు పెరిగిన డిమాండ్

- కూలీల కొరతతో నిలిచిన వ్యవసాయ పనులు
- ముదురుతున్న వరి నారుమళ్లు, ఇబ్బంది పడుతున్న రైతులు
- పత్తి రైతుల పరిస్థితి అంతే
- వ్యవసాయం బంద్ చేయడమే మేలంటున్న కర్షకులు



జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలో వరినాట్లు వేస్తున్న కూలీలు

కేటీదొడ్డి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా వర్షాలు తగ్గడంతో రైతులు వివిధ రకాల వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. మండలంలో వరి, పత్తి, మిరప తదితర పంటలను సాగు చేస్తున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో ఇప్పటికే చాలామంది రైతులు వరినాట్లు వేశారు. ఇంకా వరినాట్లు వేసే పనిలో ఉన్నారు. కానీ వరినాటు వేసేందుకు, పత్తి పొలాల్లో క్రాసింగ్ చేయడానికి, కలుపు ఇతర పనులు చేయడానికి కూలీలు దొరకకపోవడంతో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

గతేడాది కంటే ఈ ఏడాది ఎక్కువ సాగు

గత ఏడాది మండలంలో 13 వేల ఎకరాలలో వరి పంటను సాగు చేశారు. గతేడాది కంటే ఈ సారి ఎక్కువగానే వరినాట్లు వేశారు. కేటీదొడ్డి, నందిన్నె, ఉమిత్యాల తదితర గ్రామాలలో కొంత మంది కూలీలు బతుకు దెరువు కోసం వివిధ ప్రాంతాలకు వెళ్లగా.. వ్యవసాయ పనులు ఎక్కువ కావడంతో గ్రామాల్లో ఉండే కూలీలు ధరలను రెండింతలు పెంచేశారు.

వరినాట్లకు ముందు గ్రామాల్లో మహిళలకు కూలి రూ.200, పురుషులకు రూ. 300 ఇచ్చేవారు. ప్రస్తుతం వరి నాటేందుకు కూలీలు దొరకకపోవడం వల్ల మహిళలకు రూ.500 నుంచి రూ.600, పురుషులకు రూ.600 నుంచి 700 వరకు ఇచ్చినా దొరకని పరిస్థితి ఏర్పడింది. వర్షాకాలం ప్రారంభంలో వరినాట్లు వేసినవారి పొలాల్లో ప్రస్తుతం కలుపు తీసేందుకు కూలీలు కావాలి. పత్తి పొలాల్లో క్రాసింగ్ చేయడానికి కొంతమంది, వివిధ గ్రామాలకు వెళ్లి పనులు చేసేవారు కొంతమంది ఉండడంతో ప్రస్తుతం గ్రామాల్లో కూలీలకు డిమాండ్ బాగా పెరిగింది. ఇప్పటికే రైతులు వరి విత్తనాలకు, కరిగేటు చేసేందుకు ట్రాక్టర్‌కు, పొలంగట్లు చెక్కడానికి, పలుగోరు పాసేందుకు, వరినాటు వేసేందుకు, ఫర్టిలైజర్‌కు ఇలా రైతులు చాలానే పెట్టుబడి పెడుతున్నారు. కొన్ని చోట్ల కూలీల కొరతతో నారుమళ్లు ముదరడంతో పంట దిగుబడిపై ప్రభావం చూపుతుందని రైతులు ఆందోళన చెందు తున్నారు.



కేటీదొడ్డి గ్రామంలో గొర్రు కొడుతున్న కూలీ

కూలీలు దొరకడం లేదు



వరినాటు వేసేందుకు, వరిమళ్లలో కలుపు తీసేందుకు మహిళలకు రూ.500 ఇస్తామన్నా దొరకడం లేదు. ఇప్పటికే పంట పెట్టుబడి చాలా ఎక్కువ అయింది. దీంతో పాటు కూలీలు కూడా రేట్లు పెంచారు. ఇది ఇలాగే కొనసాగితే వ్యవసాయం చేసేవారి సంఖ్య తగ్గిపోతుంది.

- గోవర్ధన్, రైతు కేటీదొడ్డి

ధ్యాసంతా దోచుకోవడంపైనేనా ?

- కలెక్టరేట్ ఎదుట ధర్నాలో పాలమూరు ఎంపీ డీకే అరుణ
- పార్టీలు మారడం తప్ప గద్వాలలో అభివృద్ధే లేదు
- కోర్టు నిర్మాణంలోనూ రాజకీయం అవసరమా..



ధర్నాలో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

గద్వాల న్యూటౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): గడిచిన పదేళ్లలో గద్వాల నాయకులు బాగుపడ్డారు తప్ప నడిగడ్డ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉందని పాలమూరు ఎంపీ డీకే అరుణ అన్నారు. సోమవారం గద్వాల జిల్లాలోని ప్రజా సమస్యలపై బీజేపీ జిల్లా కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ముందు ఏర్పాటు చేసిన ధర్నాలో ఆమె మాట్లాడారు. ఇక్కడున్న ప్ర జాప్రతినిధులకు కండువాల మీదున్న శ్రద్ధ అభివృద్ధిపై లేదన్నారు. ఆయన ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో ఆయనకే తెలియదన్నారు. తుమ్మిళ్ల, నెట్టెంపా డు, గట్టు ఎత్తిపోతల, ఆర్డీఎస్ ప్రాజెక్టు ఇంకా ఎందుకు పూర్తిచేయలేదని మండిపడ్డారు. ర్యాలంపాడు, జూరాల ప్రాజెక్టు లీకేజీల సమస్యలు ఎందుకు సరిచేయలేదన్నారు. నేను గద్వాల ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వేసిన రోడ్లు తప్ప మీరెక్కడ రోడ్లు వేశారో చూపాలన్నారు. కోర్టు నిర్మాణంలో రాజకీయం చేయడం తగదన్నారు. లాయర్ల మనోభావాలను గౌరవించి పాత కోర్టు ఉన్నచోటే కొత్త భవనం నిర్మాంచాలన్నారు. అలాగే ప్రధాని మోదీ తల్లి గురించి రాహుల్ గాంధీ అభ్యంతరక వ్యాఖ్యలు చేయడాన్ని మహిళల అందరి తరుపున ఖండిస్తున్నామని, వెంటనే రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం గద్వాల జిల్లా సమస్యలపై కలెక్టర్ బీఎం సంతోష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో గద్వాల జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి వీరేంద్రగౌడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, జనరల్ సెక్రటరీ డీకే. స్నిగ్ధారెడ్డి, పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్లు బండల వెంకట్రాములు, రమాదేవి తదితరులు ఉన్నారు.

యువతకు అవగాహన కల్పించాలి

- జిల్లా స్థాయి నార్కోటిక్ సమన్వయ సమావేశంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్ చౌరస్తా, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు బారిన పడకుండా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి నార్కోటిక్ సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంబంధిత శాఖల నుంచి నివేదిక తీసుకోవడంతో పాటు బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు ఉత్పత్తి చేయడం, వినియోగించడం కానీ జరుగకుండా కట్టుదిట్టమైనా నిఘా పెట్టాలన్నారు. కళాశాలల్లో ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్ కమిటీలను క్రియాశీలంగా మార్చి ప్రతీ నెల మొదటి శుక్రవారం యాంటీ డ్రగ్ సమావేశాలు నిర్వహించాలన్నారు. డీఎస్పీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 2025 సంవత్సరంలో 6 కేసులు నమోదు అయినట్లు తెలిపారు. అనుమానం వస్తే కళాశాలల్లోను శునకాల ద్వారా తనిఖీలు నిర్వహిస్తామని తెలియజేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఎన్. కీమ్యానాయక్ యాదయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, ఎక్సైజ్ సూపరిండెంట్ బి.శ్రీనివాస్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రెండు వారాలుగా.. మారని పరిస్థితి

- యూరియా కోసం తప్పని కష్టాలు
- పీఏసీఎస్‌ల వద్ద బారులు
- మద్దూరు పీఏసీఎస్ వద్ద మాజీ ఎమ్మెల్యే ధర్నా



ఖిల్లాఘణపురం పీఏసీఎస్ కార్యాలయం వద్ద యూరియా కోసం రైతుల నిరీక్షణ

7

కంపెనీలు, ఆర్గనైజర్లపై చర్యలు తీసుకోవాలి

- విత్తన పత్తి రైతులను ఆదుకోవాలి
- ఎన్‌హెచ్‌పీఎస్ జిల్లా చైర్మన్ రంజిత్ కుమార్

7

ఉబికి వస్తున్న గంగమ్మ

అధిక వర్షాలతో పెరిగిన భూగర్భ జలాలు

గద్వాల సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో భూగర్భ జలాలు పైపైకి వస్తున్నాయి. మానవపాడు మండలం చిన్న ఆముదాల పాడు గ్రామంలో రైతు మునిస్వామి వేసిన 380 ఫీట్ల బోరు నుంచి దాదాపు నాలుగు ఇంచులమేర నీరు కేసింగ్‌లో నుంచి ఉబికి వస్తున్నాయి. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురవడం, కాలువలలో నీటి పారుదల ఉండటంతో పాటు శ్రీశైలం బ్యాక్ వాటర్ వలన కూడా గంగమ్మ పైపైకి వస్తోంది. రైతు గత ఫిబ్రవరిలో బోరు వేశాడు. అప్పట్లో నీళ్లు తక్కువ పడ్డాయి. మోటారు సహాయంతో వ్యవసాయం చేశాడు. ఇప్పుడు మోటారు లేకుండానే పైకి ఉబికి వస్తుండటంతో చుట్టుపక్కల రైతులు సంబురపడుతున్నారు.



మానవపాడు మండలం చిన్న ఆముదాలపాడులో బోరు కేసింగ్‌లో నుంచి ఉబికి వస్తున్న నీరు

బాధితులకు న్యాయం చేయడమే పోలీసుల లక్ష్యం

- జోగుళాంబ జిల్లా జోన్-7 డీఐజీ ఎల్.ఎస్ చౌహాన్



పెబ్బేరు పోలీసుస్టేషన్ ఆవరణలో మొక్కనాటిన డీఐజీ చౌహాన్

పెబ్బేరు/పెద్దమందడి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో పోలీసుల లక్ష్యం బాధితులకు న్యాయం చేయడమేనని జోగుళాంబ గద్వాల జిల్లా జోన్-7 డీఐజీ ఎల్.ఎస్ చౌహాన్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం పెబ్బేరు, పెద్దమందడి పోలీస్ స్టేషన్లను ఆయన తనిఖీ చేశారు. వనపర్తి జిల్లాలోని పెబ్బేరులో ఎస్పీ రావుల గిరిధర్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం డీఐజీ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి మొక్కలను నాటారు. పోలీస్ స్టేషన్‌ల్లోని పరిసరాలు, రికార్డులు, లాకప్, టెక్నికల్ గదిని పరిశీలించారు. కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల పట్ల అంకితభావంతో ఉంటూ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలన్నారు. వృత్తిలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొంటూ ఉత్తమ ఫలితాలను సాధించి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్ రావు, సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.

అవస్థల్లో.. అంగన్‌వాడీలు

- సొంత భవనాలు లేక ఇబ్బందులు - పౌష్టికాహారం నిల్వకు కష్టాలు



చిన్నతాండ్రపాడులో ఇరుకు గదిలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

అయిజ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లోని పాత గదులు, గాలి, వెలుతురు సరిగా రాని, మౌలిక వసతులు లేని అద్దె భవనాల్లో నిర్వహణ కష్టంగా మారింది. జిల్లాలోని 13 మండలాల్లో గద్వాల, మల్దకల్, మానవపాడులలో 3 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వాటి పరిధిలో 713 అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. మొత్తం 29,498 మంది పిల్లలు కేంద్రాలకు వస్తున్నారు. 9,621 మంది గర్భిణులు, బాలింతలు ఉన్నారు. మొత్తం అంగన్‌వాడీల్లో 286 కేంద్రాలకు సొంత భవనాలున్నాయి. 427 కేంద్రాలకు సొంత భవనాలు లేవు. మండలానికి రెండు చొప్పున 26 కొత్త భవనాల నిర్మాణానికి సంబంధిత అధికారులు ఇటీవల ప్రభు త్వానికి ప్రతిపాదనలను పంపించగా, నిధులు మంజూరయ్యాయి.

ఇరుకు గదులు, రేకుల షెడ్లు

సొంత భవనాలు లేని అంగన్‌వాడీల్లో కొన్నింటిని అద్దె భవనాల్లో నిర్వహిస్తు న్నారు. అవి ఇరుకుగా ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరికొన్ని కేంద్రాలను రేకుల షెడ్‌లలో నిర్వహిస్తున్నారు. కొన్ని ఊర్లలో గ్రామ పంచాయతీ పాత భవనాలు, స్థానిక పాఠశాలల్లోని గదులను వినియోగిస్తున్నారు. దీంతో టీచర్లు, ఆయాలతో పాటు కేంద్రాలకు వచ్చే చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. మౌలిక వసతులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆయా కేంద్రాల్లో చిన్నారులు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉండాల్సి ఉంటుంది. ఇరుకు గదులు కావడంతో వారు ఆడుకునే వీలు కూడా ఉండటంతో ఇబ్బంది పడుతున్నారు. అలాగే గర్భిణులు, బాలింతలు కూడా ఇబ్బంది పడుతున్నారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహా రం నిల్వకు స్థలం సరిపోవడం లేదు. దీంతో కొందరు టీచర్లు ఇళ్లలోనే నిల్వచేసుకోవాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలతో పాలు చిన్నారులు అవస్థలు పడుతున్నారు. అన్ని కేంద్రాల కూ సొంత భవనాలు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

స్థల సేకరణకు చర్యలు

అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించడానికి స్థల సేకరణ కొనసాగుతోంది. జిల్లాలో ప్రతీ మండలానికి రెండు చొప్పున 26 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలను నిర్మించనున్నారు. స్త్రీ శిశు సంక్షేమశాఖ, ఉపాధి హామీ, 15వ ఆర్థిక సంఘాల నుంచి ఒక్కో భవనానికి రూ. 12 లక్షల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయి.

- సునంద, స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి

సీపీఎస్ అంతం.. ఉద్యోగుల పంతం

- టీజీఈజేఏసీ జిల్లా చైర్మన్ బావండ్ల వెంకటేశ్



నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి):ఉద్యోగులు, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన సీపీఎస్ అంతం.. ఉద్యోగుల పంతమని టీజీఈజేఏసీ జిల్లా చైర్మన్ బావండ్ల వెంకటేశ్ అన్నారు. సోమవారం టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న పెన్షన్ విద్రోహదినం పాటిస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫె స్టోలో పొందుపరిచిన విధంగా తక్షణమే సీపీఎస్ రద్దు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో టీజీఈజేఏసీ ప్రధాన కార్యదర్శి పి.రాజశేఖర్‌రావు, కో చైర్మన్లు శ్రీధర్‌శర్మ, శ్రీధర్‌రావు, డీటీయూ రామస్వామి, ట్రెసా అధ్యక్షుడు ఖాజామొయినోద్దీన్, సీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.కృష్ణ, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.మురళీ తదితరులు పాల్గొన్నారు.


వనపర్తి పట్టణంలోని సాయినగర్ కాలనీ రామాలయం వద్ద పూజలందుకుంటున్న వినాయకుడు


కొత్తకోటలోని భవానీనగర్ కాలనీలో కొలువుదీరిన గణనాథుడు


వనపర్తి జిల్లాలోని రాంనగర్ కాలనీలో విఘ్నేశ్వరుడు



రాజోలి చిన్నబజారులో ప్రతిష్ఠించిన శివతాండవ ఆకారంలోని 15 అడుగుల భారీ గణపతి విగ్రహం

శశివర్ణం చతుర్భుజం


శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం!!
ప్రసన్న వదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోప శాంతయే!!

ఈ శ్లోకానికి నిదర్శనంగా చతుర్భుజ గణపతి కొలువు దీరి భక్తుల పూజలందుకుంటున్నాడు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గణేశ్ ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వాడవాడలా ఏర్పాటు చేసిన మండపాలు గణపతి పాటలతో మారుమోగుతున్నాయి.

- నెట్‌వర్క్ (ఆంధ్రజ్యోతి)


పాలమూరులో కిసాన్ చత్రపతి యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన బాల గణపతి


మహబూబ్‌నగర్‌లో రామ్‌మందిర్ చౌరస్తాలో భక్తుల పూజలందుకుంటున్న మహా గణపతి


మహబూబ్‌నగర్‌లో రైతు బాలభక్త సమాజం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శాంత గణపతి

సీఎం వ్యక్తిగత సహాయకుడి కుటుంబానికి స్పీకర్ పరామర్శ


రామచంద్రారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్

ఉప్పునుంతల/వంగూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నాగర్ కర్నూలు జిల్లా ఉప్పునుంతల మండలం తిరులాపూర్ గ్రామంలో జరిగిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వ్యక్తిగత సహాయకుడు (పీఏ) జైపాల్‌రెడ్డి తండ్రి రామచంద్రారెడ్డి దశదినకర్మకు సోమవారం శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హాజరయ్యారు. జైపాల్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయనతో పాటు రామచంద్రారెడ్డి చిత్రపటానికి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపి మధుయాష్కీగౌడ్, మల్కాజ్‌గిరి కాంగ్రెస్ ఇన్‌చార్జి మైనంపల్లి హనుమంతరావు, ముఖ్యమంత్రి సోదరుడు కృష్ణారెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు అనంత ప్రతాప్‌రెడ్డి, అనంతరెడ్డి, రఘుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

యశోదమ్మకు ఘన నివాళి

వంగూరు మండలంలోని డిండిచింతపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ముత్యాల్‌రెడ్డి తల్లి యశోదమ్మ ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేశ్ సోమవారం వారి ఇంటికి వచ్చారు. యశోదమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ముత్యాల్‌రెడ్డితో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట నాయకులు వేపూరి సోమన్న, కాయితి విజయకుమార్‌రెడ్డి ఉన్నారు.

ఉప రాష్ట్రపతి అభ్యర్థిని కలిసిన ఎమ్మెల్యే


సీఎం రేవంత్ రెడ్డితో కలిసి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ న్యూటౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డిని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని తాజ్ హోటల్ వద్ద సోమవారం రాత్రి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గనులు, కార్మిక, ఉపాధిశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిలతో ఆయనను కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

'సంగంబండ' నుంచి నీటి విడుదల

మక్తల్ రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మక్తల్ మండలంలోని సంగంబండ జలాశయం నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. సోమవారం ఒక గేటు ఎత్తి 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. జలాశయానికి 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని డీఈఈ సురేశ్ తెలిపారు. రిజర్వాయర్ పూర్తి నీటి నిల్వ పూర్తి సామర్థ్యం 3.313 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 2.67 టీఎంసీలు ఉందని చెప్పారు.

అదుపు తప్పి కారు బోల్తా


తుపత్రాల సమీపంలో బోల్తా పడిన కారు

అయిజ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ, తుపత్రాల మధ్య ఓ కారు అదుపు తప్పి బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు సోమవారం కారులో మంత్రాలయానికి బయలుదేరారు. అయిజ సమీపంలో పోలోనివాగు పారుతుండటంతో ఉత్తనూర్ మీదుగా వెళ్లారు. తుపత్రాల సమీపంలో కారు అదుపు తప్పి పక్కనున్న పొలంలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. కారులోని వారందరూ సురక్షితంగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు. సంఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని అయిజ ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

రోజూ పది కిలో మీటర్లు
నడిస్తేనే చదువు

- గ్రామాలకు రాని పల్లె వెలుగు బస్సులు
- విద్యార్థులకు తప్పని తిప్పలు
- బస్సులు పునరుద్ధరించాలని కోరుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు


రేవల్లికి కాలినడకన వెళుతున్న విద్యార్థులు

ఊర్కొండ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలకు పల్లె వెలుగు బస్సులు రాకపోవడంతో విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. చదువుకోవాలంటే సుమారు నాలుగైదు కిలోమీటర్ల మేర నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి. కాస్త ఆర్థిక పరిస్థితి బాగున్న వారు తమ పిల్లలను పట్టణ ప్రాంతాల్లో చదివిస్తున్నారు. నిరుపేద విద్యార్థులే ప్రాథమిక విద్య పూర్తయ్యాక, హైస్కూల్ విద్య కోసం పక్క గ్రామాలకు వెళ్లాల్సి ఉంటుంది. పల్లె వెలుగు బస్సులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

● మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు రేవల్లి, తిమ్మన్నపల్లి గ్రామాల నుంచి 4 కిలోమీటర్లు కాలినడకన కల్లకుర్తి- జడ్చర్ల ప్రధానరహదారిపై ఉన్న రేవల్లి గేటుకు చేరుకొని అక్కడి నుంచి బస్సులో 6 కిలోమీటర్లు ప్రయాణించి పాఠశాలకు చేరు కుంటున్నామని పలువురు వి ద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

● మాదారం ఉన్నత పాఠశాలకు గుడిగానిపల్లి, గ్రామం నుంచి విద్యార్థులు రానుపోను రోజుకు 10కిలోమీటర్లు నడుస్తున్నారు. ఊర్కొండపేట ఉన్నత పాఠశాలకు జకినాలపల్లి, నర్సంపల్లి విద్యార్థులు సుమారుగా రానుపోను 8 కిలో మీటర్లు కాలినడక వెళుతున్నారు.

ఇలా మండలంలోని పలు గ్రామాలకు పల్లె వెలుగు బస్సులు రాకపోవడంతో కొందరు విద్యకు దూరం అవుతుండటంతో తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమవున్నారు. ప్రభుత్వాలు ప్రభుత్వ బడులను బలోపేతం చేసే దిశగా కృషి చేయడంతో పాటు ఈ పాఠశాలలకు విద్యార్థుల సంఖ్య పెరిగే విధంగా గ్రామాలకు బస్సుల రవాణా సౌకర్యం కలిపించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రోజూ 8 కిలోమీటర్లు నడుస్తున్నాం



నేను ఊర్కొండ మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్నా.రోజూ మా గ్రామం నుంచి పాఠశాల చేరుకోవడానికి రానుపోను ఎనిమిది కిలోమీటర్లు నడుస్తున్నా. దాంతో ఇంటికి వెళ్లేసరికి చీకటి అవుతుంది. అలసిపోయి సరిగా చదువుకోలేక తక్కువ మార్కులు వస్తున్నాయి. గతంలో మా గ్రామం నుంచి పట్టణ ప్రాంతాలకు బస్సులు నడిచేవి. ప్రస్తుతం రావడం లేదు. అధికారులు మా గ్రామానికి బస్సులు నడిపించాలని వేడుకుంటున్నా.

- నాని, 7వ తరగతి, రేవల్లి

క్రీడలతో మనసికోల్లాసం

- పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న పీయూ వీసి ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని యూనివర్సిటీలో పనిచేస్తున్న బోధన, బోధనేతర ఉద్యోగులకు సోమవారం ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఉద్యోగులు, అధ్యాపకులు విధి నిర్వహణలో ప్రతీ రోజు ఒత్తిడికి గురవుతుంటారని, ఇలాంటి ఆటల పోటీలలో పాల్గొనడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. పీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రమేశ్‌బాబు మాట్లాడుతూ ప్రతీ రోజు ఒక గంట ఆటలకు కేటాయించాలని సూచించారు. పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించడం సంతోషకరమన్నారు. అనంతరం వీసీ, రిజిస్ట్రార్ షటిల్ పోటీల్లో పాల్గొని సిబ్బందిలో ఉత్సాహం నింపారు. కార్యక్రమంలో ఆడిట్‌సెల్ డైరెక్టర్ డాక్టర్ చంద్రకిరణ్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ప్రవీణ, ప్రిన్సిపాళ్లు డాక్టర్ రవికాంత్, డాక్టర్ కరుణాకర్ రెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ అర్జున్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ వై.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎనిమిది డీజేల స్వాధీనం

- సంప్రదాయ పద్ధతిలో పండుగలు జరుపుకోవాలి
- నారాయణపేట ఎస్పీ యోగేష్ గౌతం


డీజే నిర్వాహకులు గణేష్ ఉత్సవ సమితి వీహెచ్‌పి నాయకులతో ఎస్పీ యోగేష్ గౌతం

నారాయణపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నిషేధాజ్ఞలను ఉల్లంఘించి ఏర్పాటు చేసిన 8 డీజే (సౌండ్ సిస్టమ్)లను స్వాధీనం చేసుకున్నట్లు నారాయణపేట ఎస్పీ యోగేష్ గౌతం తెలిపారు. గణేష్ ఉత్సవ సమితి సభ్యులు, వీహెచ్‌పీ నాయకులతో జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పండుగలు, వేడుకలను సంప్రదాయ పద్ధతిలో నిర్వహించుకోవాలని సూచించారు. డీజేలతో శబ్ద కాలుష్యం పెరుగుతుందని, చిన్నారులు, విద్యార్థులు, వృద్ధులు, రోగులు ఇబ్బంది పడతారని తెలిపారు. గుండె పోటు వచ్చే ప్రమాదం కూడా ఉందన్నారు. ఈ నేపథ్యంలో డీజేల వినియోగాన్ని పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు, వినాయక నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ పండుగల సమయంలో డీజేలను వినియోగించవద్దని స్పష్టం చేశారు. అయినా డీజేలను వినియోగించినందున నారాయణపేట పట్టణంలో 2, రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 3, దామరగిద్దలో 2, మద్దూరులో ఒకటి, మొత్తం 8 డీజేలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే కర్ణాటక రాష్ట్రం నుంచి నారాయణపేట జిల్లాకు డీజేలు రాకుండా సరిహద్దులో ఐదు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నిషేధాజ్ఞలను ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంప్రదాయబద్ధంగా కోలాటాలు, భజనలు, డప్పు వాయిద్యాలతో ఉత్సవాలు నిర్వహించుకోవాలని సూచించారు.

నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలి


రిలే దీక్షలో మాట్లాడుతున్న ఆర్.వెంకట్రాములు

కోడేరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా ఏదుల రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన తీగలపల్లి గ్రామ భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని తీగలపల్లి గ్రామంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. 70 మంది రైతులు పొలం కోల్పోయి పరిహారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగిన అధికారులు ఎందుకు స్పందించడం లేదన్నారు. కార్యక్రమంలో నరసింహ, చింతం ఆంజనేయులు, కాకం వెంకటయ్య, శివయ్య, పర్వతాలు, శివశంకర్, వరప్రసాద్, రాములు, చిన్న రాములు తదితరులు పాల్గొన్నారు.

గణపతి లడ్డు రూ.3 లక్షలు

- జడ్చర్ల వేంకటేశ్వర కాలనీలో వేలం
- అత్యధికంగా పాడి దక్కించుకున్న అశోక్‌రెడ్డి


జడ్చర్లలోని వెంకటేశ్వర కాలనీలో అత్యధిక మొత్తానికి లడ్డూను దక్కించుకున్న తేనేటి అశోక్‌రెడ్డి దంపతులు

జడ్చర్ల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మునిసిపాలిటీలోని వెంకటేశ్వర కాలనీ ఫేస్-1లో స్థానికులు ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద సోమవారం గణపతి లడ్డూను వేలం వేశారు. పోటీపోటీగా కొనసాగిన వేలం పాటలో, అదే కాలనీకి చెందిన తేనేటి అశోక్‌రెడ్డి అనే వ్యక్తి అత్యధికంగా రూ.3.01లక్షలకు లడ్డూను దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి దంపతులకు మండప నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. అలాగే పద్మావతి కాలనీలో ఫేస్-1 యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద నిర్వహించిన వేలంలో పెద్ద లడ్డూను రూ.2.51లక్షలకు తూడి అనిల్‌కుమార్‌రెడ్డి, చిన్న లడ్డూను రూ.1.36 లక్షలకు బాదేపల్లి ప్రణవి దక్కించుకున్నారు.

గణపయ్యా... ఆదుకోవయ్యా..


- వినాయకుడికి కానుకుర్తి రైతుల వేడుకోలు
- తమ ఆవేదనను తెలియజేస్తూ ఫ్లెక్సీల ఏర్పాటు
- నిమజ్జనం సందర్భంగా వినూత్న నిరసన



నిమజ్జనానికి బయలుదేరుతున్న బజరంగ్‌దళ్ యూత్ ఆధ్వర్యంలో గణనాథుడు

దామరగిద్ద, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఓ బొజ్జ గణపయ్యా.. మా మొరను ఆలకించవయ్యా.. మా కష్టాలను తీర్చవయ్యా అని కానుకుర్తికి చెందిన రైతులు వినాయకుడిని వేడుకున్నారు. నారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న రిజర్వాయర్ కింద కానుకుర్తి రైతులకు చెందిన భూ ములు ముంపునకు గురవుతున్నాయి. దీంతో బాధిత రైతులు 25 రోజులుగా రిలే దీక్షలు కొనసాగిస్తున్నారు. ఎకరానికి రూ.35 లక్షలకు తగ్గకుండా పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం గ్రామంలో జరిగిన నిమజ్జనం వేడుకల్లో తమ ఆవేదనను వినూత్నంగా వ్యక్తపరిచారు. 'కానుకుర్తి రైతు గోడు' శీర్షికతో రైతు కన్నీటి బొట్టుపైన రిజర్వాయర్ నినాదంతో, ఆందోళనలకు చెందిన చిత్రాలతో రూపొందించిన ఫ్లెక్సీని వాహనంపై ఏర్పాటు చేశారు. దాని ముందు గణపతి విగ్రహాన్ని ఉంచి ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. గ్రామ సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు. ఈ విషయం స్థానికంగా చర్చనీయాంశం అయ్యింది.

జాతీయ క్రీడా పోటీలకు వనపర్తి విద్యార్థి


విద్యార్థి చరణ్‌కుమార్

వనపర్తి విద్యా విభాగం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థి చిరణ్‌కుమార్ జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని పాలమూరు యూనివర్సిటీలో గత నెల 31, 31వ తేదీల్లో జరిగిన తెలంగాణ 11వ జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ప్రస్తుతం జెఎన్‌టీయూహెచ్‌లో బీటెక్ (సీఎస్‌సీ) రెండవ సంవత్సరం చదువుతున్న చరణ్‌కుమార్ ఈ పోటీల్లో పాల్గొన్నాడు. లాంగ్ జంప్ విభాగంలో బంగారు పతకం, ట్రిపుల్ జంప్ విభాగంలో వెండి పతకాలను సాధించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అతడిని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీఎస్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ రామ్ నరేశ్ యాదవ్, అధ్యాపకులు అభినందించారు.

హరీశ్‌రావు, సంతోష్‌రావు

అవినీతి అనకొండలు

(మొదటిపేజీ తరువాయి)



మీడియా మిత్రులతో రకరకాలుగా చెప్పించారు. సోషల్ మీడియా ద్వారా ఇప్పటివరకు నాపై జరిగిన పర్సనల్ ఎటాక్‌ను ఓర్చుకుంటూ వచ్చాను. ఇంతవరకు పేరు పెట్టి చెప్పలేదు. ఇప్పుడు మొదటిసారి చెబుతున్నా. దేవుడి లాంటి మా నాన్నపై సీబీఐ విచారణ చేస్తామంటుంటే.. ఒక బిడ్డగా కడుపు రగిలిపోతోంది. అందుకే చెబుతున్నా" అని అన్నారు.

ఇంకా వాళ్లనే మోస్తారా?

"హరీశ్‌రావు, సంతోష్.. కేసీఆర్ పక్కన ఉండి, ఆయన పేరు చెప్పుకొని అనేక విధాలుగా లబ్ధి పొందారని కవిత తెలిపారు. వారి చర్యల వల్లే కేసీఆర్ పేరు బద్నామ్ అయ్యే పరిస్థితి వచ్చింది. అయినా వాళ్లనే మోస్తామని, వాళ్లనే మళ్లీ ముందుకు తీసుకెళ్తామని అనుకుంటే.. పార్టీ ఎలా ముందుకుపోతుందని ప్రశ్నించారు. "ఒక బిడ్డగా నేను బాధపడుతున్నా. ఐదేళ్లు ఇరిగేషన్ మంత్రిగా చేసిన హరీశ్‌రావుకు ఇందులో మేజర్ పాత్ర లేదా? మా నాన్న పరిస్థితి నేను దగ్గరుండి చూశాను. నా పెళ్లికి డబ్బుల కోసం ఆయన ఎంత ఇబ్బంది పడ్డారో నాకు తెలుసు. రాజకీయాల్లో 40, 50 ఏళ్లు ఉన్నా.. కేసీఆర్ ఆస్తులు సంపాదించుకోలేదు. నాకు తెలిసి ఆయనకు డబ్బుపై ఎన్నడూ ఆశలేదు. అలాంటి వ్యక్తిపై సీబీఐ విచారణ చేస్తామని, కేసులు వేస్తామని అంటే.. ఇందుకు ఎవరు కారణం? ఈ వయసులో ఆయనపై సీబీఐ కేసులేంటి? ఏం ఖర్మ? ఇలాంటి వాళ్లను ఎందుకు భరించాలి? ఎందుకు ప్రొటెక్ట్ చేయాలి? బీఆర్ఎస్ తమ్ముళ్లకు నాపై కోపం రావచ్చు. వాస్తవాలు చేదుగా ఉన్నా.. మందులాగా అప్పుడప్పుడు మాట్లాడితేనే ఆరోగ్యంగా ఉంటుంది" అని కవిత వ్యాఖ్యానించారు.

హరీశ్, సంతోష్ వెనక రేవంత్‌రెడ్డి..

కాంగ్రెస్ ప్రభుత్వం చేతకాని ప్రభుత్వమని కవిత మండిపడ్డారు. ఏసీబీ మగ్గురు కాళేశ్వరం ఇంజనీర్లను పట్టుకుంటే, ఒక్కో ఇంజనీరు దగ్గర వందల కోట్ల ఆస్తులు బహిర్గతమైతే.. విచారణ చేసే దమ్ము ప్రభుత్వానికి లేకుండాపోయిందని ధ్వజమెత్తారు. వారి వెనకాల ఎవరున్నారని ప్రశ్నించారు. "హరీశ్‌రావు, సంతోష్‌రావు వెనక రేవంత్‌రెడ్డి ఉండి కాపాడుతున్నారు. బాణం గురి ఎంతసేపూ కేసీఆర్‌పైనే ఉంది. అందుకే అన్ని విషయాల్లో వాళ్లను ఏమీ అనరు. వాళ్ల గురించి మాట్లాడరు. ఈ అవినీతి అనకొండలతో రేవంత్‌కు ఉన్న రహస్య ఒప్పందం బహిర్గతం కావాలి. పీసీ ఘోష్ కమిషన్ నివేదికలో ఏముందో చెప్పకుండానే టక్కున సీబీఐకి ఇస్తామనడం ముందస్తు కుట్ర. కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీయడమే వారి లక్ష్యం. మీరు బట్టకాల్చి మీదవేసినట్లు ఆరోపణలు చేయడం కాదు. నేను డిమాండ్ చేస్తున్నా.. పేర్లు కూడా చెప్పాను. దమ్ము ధైర్యం ఉంటే వారిపై విచారణ చేయించాలి. వాస్తవాలు బయటపెట్టి వారితో అండర్‌స్టాండింగ్ లేదని నిరూపించుకోవాలి" అని కవిత సవాల్ చేశారు.

ఎవరో చెబితే ఆడే తోలుబొమ్మను కాదు..!

తాను తన తండ్రికి రాసిన లేఖను లీక్ చేసిన సందర్భంలో అసలు విషయాలు బహిర్గతం చేసినందుకు 90 రోజులుగా తనను దుష్ప్రచారాలతో వేధిస్తున్నారని కవిత తెలిపారు. ఇప్పుడు కాళేశ్వరం విషయంలో వాస్తవాలు మాట్లాడినందుకూ వాళ్ల సోషల్ మీడియా బ్యాచ్‌లు రేపటి నుంచి అడ్డగోలు విమర్శలు చేస్తాయన్నారు. "నన్ను బీజేపీ ఆపరేట్ చేస్తుందంటారు. కాంగ్రెస్ ఆపరేట్ చేస్తుందంటారు. ఒకరు రేవంత్‌రెడ్డి చెబితే మాట్లాడుతుందని, మరొకరు బండి సంజయ్ చెబితే మాట్లాడుతుందంటూ దుష్ప్రచారం చేస్తారు. ఖబడ్దార్ బిడ్డా.. నేను ఎవరో చెబితే ఆడే తోలుబొమ్మను కాదు. నాది కేసీఆర్ రక్తం.. తెలంగాణ బ్లడ్. వ్యక్తిగతంగా నేను అనుకున్న విషయాన్ని చెబుతున్నా. దానికి రాజకీయంగా ఇబ్బంది అయినా, నష్టమయినా, కష్టమయినా.. నేనే భరిస్తా" కవిత స్పష్టం చేశారు.

ఇలాంటి పార్టీ ఉంటే ఏంది? పోతే ఏంది?

దేశంలో ఎక్కడికి వెళ్లినా.. కేసీఆర్ మహానాయకుడు అంటారని కవిత తెలిపారు. ఇప్పుడు సీబీఐ విచారణ జరిపితే.. ఏం మాట్లాడతారని ప్రశ్నించారు. "మా నాన్న పరువు పోతే నాకు బాధ. మీకా? వాళ్లకు పైసలు కావాలె. పేరుతో ఏం పని? ఇంక కూడా ఇటువంటి విషయాలు అర్థం చేసుకోకుండా, ఇలాంటి వ్యక్తులను దూరం పెట్టకుంటే.. ఇలాంటి పార్టీ ఉంటే ఏంది? పోతే ఏంది? బీఆర్ఎస్ నాయకులు నన్ను తిట్టుకున్నా సరే. స్థానిక ఎన్నికల్లో నష్టం జరుగుతదని అనుకున్నా సరే. మా నాన్నమీద సీబీఐ విచారణ పడ్డాక ఏముంది? ఎలక్షన్‌లో ఒకరు గెలుస్తరు, ఒకరు ఓడిపోతరు. అసలు పార్టీ ఓడిపోయే పరిస్థితి ఎందుకు వచ్చింది? ఇటువంటి దుర్మార్గుల వల్ల కాదా? ఊ అంటే.. మా దగ్గర పైసలున్నయని, టీవీలున్నయని, సోషల్ మీడియాలుయని ఎటు పడితే అటు మాట్లాడతామంటే తోలు తీస్తం. గీత గీసుకుంటం బిడ్డా. మీరు ఒక కామెంట్ పెడితే.. మేం పది పెడతాం. ఇంతకాలం చూస్తూ ఊరుకున్నా. పెద్ద సారు దగ్గరికి వచ్చాక ఇక కాంప్రమైజ్ అయ్యేది లేదు. నిజంగానే ఆయన అవినీతికి పాల్పడితే వేరుమాట. కేసీఆర్‌కు ఎప్పుడూ తెలంగాణ ధ్యాసే.. అదే పిచ్చి. అలాంటి వ్యక్తిపై ఏది పడితే అది మాట్లాడితే.. రియాక్ట్ కాకపోవడం చాలా దారుణం. సీబీఐ విచారణ చేస్తున్నామని రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటిస్తే.. తెలంగాణ బంద్‌కు పిలుపు ఇవ్వొద్దా? తెలంగాణ భగ్గుమనొద్దా? దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. ఏదేమైనా సీబీఐ విచారణ చేసినా.. కేసీఆర్ కడిగిన ముత్యంలా బయటకు వస్తారు" కవిత పేర్కొన్నారు.

మూడు పిల్లర్లు కుంగిపోతే రెండున్నరేళ్లుగా లొల్లి!

కేసీఆర్ తరతరాలకు తరగని ఆస్తిలా కట్టిన కాళేశ్వరాన్ని బద్నామ్ చేస్తున్నారని కవిత అన్నారు. "మహాసముద్రం లాంటి కాళేశ్వరంలో చిన్న పార్ట్ అయిన మేడిగడ్డలో మూడు పిల్లర్లు కుంగిపోతే.. ప్రాజెక్టు మొత్తం కూలిపోయిందని రెండున్నరేళ్లుగా లొల్లి పెడుతున్నారు. నేను 2006 నుంచి తెలంగాణ ఉద్యమంలో పాల్గొంటూ రాజకీయాల్లో యాక్టివ్‌గా ఉన్నాను. అప్పటినుంచి ఇప్పటివరకు ప్రజల విషయం తప్ప.. వ్యక్తిగత విషయాలు మాట్లాడరు. అటువంటి మహానాయకుడు అవినీతికి పాల్పడ్డారని, లక్ష కోట్లు దోచుకున్నారని, నిజాం కన్నా ధనికుడు కావాలనుకున్నారని అంటున్నారు. అవును కచ్చితంగా నిజాం బాటలోనే నడుస్తాం. నిజాం కట్టిన ఉస్మాన్‌సాగర్ నీళ్లే కదా.. నేటికీ హైదరాబాద్ ప్రజలు తాగుతున్నది! ఆ నిజాం స్ఫూర్తి అని మా నాన్న చాలాసార్లు చెప్పారు. కచ్చితంగా 200 ఏళ్లు తెలంగాణ ప్రజలు కాళేశ్వరం ప్రాజెక్టును కట్టిన కేసీఆర్‌ను తలుచుకుంటారు. కేసీఆర్‌కు ఉన్న అవగాహన, ఉమ్మడి ఏపీలో అయన అనుభవించిన వివక్ష, తెలంగాణకు వ్యతిరేకంగా పనిచేసిన ప్రస్తుత సీఎంకు తెలియదు. నేటికీ ఆయన పక్క రాష్ట్రం ఎజెండాను అమలు చేస్తున్న వ్యక్తి. బనకచర్ల కడతామంటే మాట్లాడని వ్యక్తి.. కేసీఆర్ గురించి అసెంబ్లీలో ఉదయం నుంచి రాత్రి వరకు అనరాని మాటలు అంటుంటే నా గుండె బరువెక్కింది. ఇదే రేవంత్‌రెడ్డి గతంలో ఓ టీవీ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, 'కేసీఆర్‌కు పైసల మీద ఆశలేదు. పాపం ఆయన మీటింగ్ పెట్టాలంటే కూడా.. అప్పుడు పైసల గురించి చూస్తారు' అన్నారు. అటువంటి ఆలోచన ఉన్న వ్యక్తిమీద ఇంత కుట్రపూరితంగా అభాండాలు ఎందుకు వేస్తున్నారు? ప్రజలు తిరగబడతారనుకుంటే.. ప్రభుత్వం తప్పులు బయటపడతాయంటే.. కేసీఆర్‌పై ఆరోపణ చేయాలి. ఆయన పేరు చెప్పకుంటే రేవంత్‌రెడ్డి ఫొటో కూడా పేపర్లో వేయరని అయన్ను విమర్శిస్తున్నారు. సెప్టెంబర్ 30లోపు ఎన్నికలు పెడతామని, 50శాతం రిజర్వేషన్లు ఎత్తేస్తామని అంటున్నారు. రాహుల్‌గాంధీ బిహార్ ఎన్నికల ప్రచారం కోసం బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ రోజుకో కొత్తకథ చెబుతోంది. గవర్నర్ వద్ద పెండింగ్ పెడితే.. సుప్రీంకోర్టుకు ఎందుకు వెళ్లడంలేదు? బిహార్ ఎన్నికల కోసమే బీసీ బిడ్డలను రేవంత్‌రెడ్డి బలి పెడుతున్నారు. ఇలాగే చేస్తే.. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బిహార్‌కు వెళ్లి ప్రచారం చేస్తాం" అని కవిత హెచ్చరించారు.

కవిత

సస్పెన్షన్ ఖాయం!?

నేడో, రేపో బీఆర్ఎస్ నుంచి ప్రకటన!.. కీలక నేతలతో అధినేత కేసీఆర్ భేటీ

- ఉపేక్షిస్తే పార్టీకి మరింత నష్టం అనే అభిప్రాయం
- ఎక్స్‌లో కవితను అన్‌ఫాలో చేయాలని ఆదేశం
- టీఆర్ఎస్ఎల్పీ వాట్సప్ గ్రూప్ నుంచి కవిత పీఆర్వో అవుట్
- సస్పెండైతే తెలంగాణ జాగృతి పేరుతో కవిత సొంత పార్టీ?



హైదరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సొంత పార్టీకి చెందిన నేతలు హరీశ్‌రావు, జోగినపల్లి సంతోష్ కుమార్‌పై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. కవిత తీరుతో పార్టీకి మరింత నష్టం జరిగేలోపే ఆమెను బీఆర్ఎస్ నుంచి సాగనంపాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో పార్టీ నుంచి కవిత సస్పెన్షన్ ఖాయం అనే ప్రచారం బీఆర్ఎస్ వర్గాల్లో జోరుగా సాగుతోంది. దీనిపై ఒక ట్రెండు రోజుల్లో బీఆర్ఎస్ నుంచి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మీడియా సమావేశంలో హరీశ్, సంతోష్‌పై కవిత సంచలన వ్యాఖ్యలు చేశాక.. ఆ పార్టీ సీనియర్ నేతలు ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు వెళ్లారు. అక్కడ కేటీఆర్, వేముల ప్రశాంత్ రెడ్డి, జగదీశ్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డితో పాటు మరికొందరు కీలకనేతలు కేసీఆర్‌తో భేటీ అయ్యారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలపై కేసీఆర్‌తో మంతనాలు జరిపారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కవిత పార్టీలో ఉంటే లాభం ఉందా? అంటూ పార్టీ నేతలను కేసీఆర్ ప్రశ్నించారు. ఇంత పెద్ద వ్యాఖ్యలు చేశాక కూడా కవితను కొనసాగిస్తే పార్టీకి మరింత నష్టం అని, ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని మెజారిటీ నేతలు కేసీఆర్‌కు సూచించారు. కవితను పార్టీలో కొనసాగితే విపక్షాలకు ఆయుధం ఇచ్చినట్లేనని నేతలు అభిప్రాయపడ్డారు. కవితపై ఎటువంటి చర్యలు తీసుకోకపోతే ముున్ముందు మరింత నష్టం జరిగే ప్రమాదం ఉందని అధినేతకు చెప్పారు. కవిత ఇదివరకే.. కేసీఆర్ చుట్టూ దయ్యాలున్నాయంటూ వ్యాఖ్యానించారు. అప్పుడే ఆమెపై నిర్ణయం తీసుకుంటారని అంతా భావించారు. అయితే ఆమెపై ఎలాంటి చర్యలు తీసుకోకుంటేనే తక్కువ నష్టం జరుగుతుందనే భావన అప్పట్లో పార్టీ పెద్దల్లో ఉండిందని.. ఇప్పుడు చేయిదాటిపోయే స్థాయికి పరిస్థితి చేరిందని ఓ కీలక నేత చెప్పారు.

కవితపై బీఆర్ఎస్ నేతల మాటల దాడి

సామాజిక మాధ్యమాల్లో కవితను వెంటనే అన్‌ఫాలో కావాలని బీఆర్ఎస్ ఐటీ విభాగం నుంచి పార్టీ శ్రేణులకు ఆదేశాలు వెళ్లినట్లు గులాబీ వర్గాలు చెబుతున్నాయి. ఆ వెంటనే ఎక్స్ ఖాతాలో కవితను ఫాలో అవుతున్న కార్యకర్తలు వెంటవెంటనే అన్‌ఫాలో అయ్యారు. సామాజిక మాధ్యమాల్లో ఆమెకు వ్యతిరేకంగా కామెంట్లు పెట్టడం మొదలుపెట్టారు. ఎలక్ట్రానిక్ మీడియాలో బీఆర్ఎస్ తరఫున చర్చలకు వెళ్లిన నేతలు కూడా కవిత తీరును తీవ్రంగా తప్పుబట్టారు. కొందరైతే కవిత తీరు వల్లే గత ఎన్నికల్లో పార్టీ ఘోర పరాజయం పాలైందని ఆరోపించారు. మరికొందరు తక్షణమే ఆమె పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ఎల్పీ వాట్సప్ గ్రూప్ నుంచి కవిత పీఆర్వోను తొలగించారు. హరీశ్‌రావు ఆరడుగుల బుల్లెట్ అంటూ బీఆర్ఎస్ సోషల్ మీడియా విభాగం పోస్టులు పెట్టింది. లండన్ పర్యటనలో ఉన్న హరీశ్‌రావుకు అక్కడి బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ విభాగం ఘనస్వాగతం పలికింది.

సస్పెండ్ చేస్తే సొంతపార్టీ?

బీఆర్ఎస్ నుంచి కవితను సస్పెండ్ చేస్తే .ఆమె అడుగులు ఎటువైపు? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. అయితే మొదట్నుంచి ఆమె ఒక స్పష్టతతో ఉన్నారని, పార్టీ నుంచి బయటకు వెళ్లాల్సివస్తే, సొంత వేదిక ఏర్పాటు చేసుకోవాలని ముందే నిర్ణయం తీసుకున్నారని విశ్లేషకులు అంటున్నారు. 2023 ఎన్నికల్లో పార్టీ పరాజయం పాలైనప్పటి నుంచి ఆమె తన జాగృతి సంస్థను నెమ్మదిగా బలోపేతం చేస్తూ వస్తున్నారు. జాగృతి పేరుతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పార్టీ పెడితే తెలంగాణ జాగృతినే పార్టీ పేరుగా ఖరారు చేసే అవకాశం ఉందని ఆమె సన్నిహితులు చెబుతున్నారు. కొత్త పేరు జోలికి వెళ్లకపోవచ్చని ఆ వర్గాలు అంటున్నాయి.

క్రైం కార్నర్

మతిస్థిమితం లేని యువకుడి ఆత్మహత్య



వెంకటేశ్ (ఫైల్)

మల్దకల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, మల్దకల్ మండలంలోని బిజ్వారం గ్రామానికి చెందిన కాకి వెంకటేశ్ (21) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ నందికర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కాకి హనుమంతు కుమారుడు కాకి వెంకటేశ్‌కు కొంత కాలం క్రితం మతిస్థిమితం తప్పింది. ఈ నెల 17న ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో తండ్రి అదే రోజు మల్దకల్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో 31వ తేదీన సాయంత్రం గద్వాల మండలంలోని పరుమాల చెరువు వద్ద నున్న చెట్టుకు ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వారు వెళ్లి పరిశీలించి, వెంకటేశ్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటోకు నిప్పంటించిన దుండగులు



కాలిపోయిన ఆటో

అలంపూరు చౌరస్తా, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండల పరిధిలోని బొంకూరు గ్రామంలో ఓ ఆటోకు దుండగులు నిప్పంటించారు. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మాలరాజశేఖర్ అనే వ్యక్తి ఆటోలో కూరగాయాలు విక్రయిస్తూ జీవనం గడుపుతున్నాడు. ఆదివారం అర్ధరాత్రి తన ఆటోను ఇంటి ముందు నిలిపి ఉంచగా, అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. ఇరుగుపొరుగు వారు గమనించి మంటలను ఆర్పేశారు. కానీ అప్పటికే అది సగం కాలిపోయిందని, దాదాపు లక్ష రూపాయల నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

అర్ధరాత్రి ట్రాక్టర్ చోరీ

కృష్ణ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పొలం వద్ద ఉంచిన ట్రాక్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా, కృష్ణ మండలంలోని గుడెబల్లూరు గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. ట్రాక్టర్ యజమాని కృష్ణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం పొలాన్ని దున్ని రాత్రి అక్కడే ఉన్న గుడిసె దగ్గర ఉంచి తాళం వేసి ఇంటికి వెళ్లిపోయాడు. సోమవారం ఉదయం వెళ్లి చూడగా ట్రాక్టర్ కనిపించలేదు. చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టినట్లు ఎస్ఐ నవీద్ తెలిపారు.

ఎంపీటీసీ మాజీ సభ్యుడి దాడి

- యువకుడికి తీవ్ర గాయాలు

ధరూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎంపీటీసీ మాజీ సభ్యుడు దాడి చేయడంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ కొండ శ్రీహరి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా, ధరూరులో జరిగింది. మండల కేంద్రానికి చెందిన కురువ రామాంజనేయులు అనే యువకుడు సోమవారం పొలానికి వెళ్తుండగా, మార్గం మధ్యలో కాపుకాసిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు కురువ దుబ్బన్న అడ్డుకొని గడ్డపారతో దాడి చేశాడు. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు గద్వాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు వారాలుగా.. మారని పరిస్థితి

- యూరియా కోసం రైతులకు తప్పని కష్టాలు
- సింగిల్ విండో కార్యాలయాల వద్ద బారులు
- తమ వంతు కోసం క్యూలైన్లో పాదరక్షలు
- మద్దూరు పీఏసీఎస్ వద్ద మాజీ ఎమ్మెల్యే ధర్నా



తిమ్మాజిపేటలో యూరియా టోకెన్ల కోసం నిలబడిన రైతులు



ఆత్మకూరు సహకార సంఘం కార్యాలయం ముందు నిరీక్షిస్తున్న రైతులు

మద్దూరు/ తిమ్మాజిపేట/ కందనూలు/ నారాయణపేట/ గోపాల్‌పేట/ ఆత్మకూరు/ అమరచింత, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. సహకార సంఘాల వద్ద పొద్దస్తమానం క్యూలైన్లలో నిలబడి ఎదురు చూస్తున్నారు. అయినా తమ వంతు వస్తుందో, రాదో తెలియని పరిస్థితి నెలకొన్నది. ఒక వేళ వచ్చినా, ఒకటి, రెండు బస్తాలతో సరిపెట్టుకోవాల్సి రావడంతో ఆవేదన చెందుతున్నారు.

● నారాయణపేట జిల్లా, మద్దూరు మండల కేంద్రంలోని పీఏసీఎస్ వద్ద కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలోనే యూరియా కొరత ఉందంటే, రాష్ట్రంలో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ధర్నాలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు యండీ సలీం, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రామకృష్ణ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, గోపాల్, వీరారెడ్డి, శాసం రామకృష్ణ, మధుసూదన్, షైపాల్, బాల్‌రెడ్డి, నీటి రాములు, గోపాల్, షైపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● నాగర్‌కర్నూల్ జిల్లా, తిమ్మాజిపేట మండల కేంద్రంలోని అగ్రో రైతు సేవా కేంద్రం వద్ద సోమవారం తెల్లవారుజాము నుంచే రైతులు క్యూలైన్లలో వేచి ఉన్నారు. టోకెన్లు ఇస్తుండగా అందరూ ఒకే సారి ఎగబడటంతో కొంత తోపులాట జరిగింది. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని పరిస్థితిని చక్కదిద్దారు. వచ్చిన వారిలో 240 మందికి టోకెన్లు అందగా, మిగిలిన వారు నిరాశతో వెనుదిరిగారు.

● నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తాలో ఉన్న ఫర్టిలైజర్ షాపుల ముందు రైతులు బారులు తీరారు. పంపిణీ ఆలస్యం కావడంతో ఆందోళనకు దిగారు. పోలీసులు వారికి సర్దిచెప్పి పరిస్థితిని చక్కదిద్దారు.


● నారాయణపేట జిల్లాలోని ధన్వాడ సింగిల్ విండోకు సోమవారం 300 బస్తాల యూరియా మాత్రమే వచ్చింది. అంతకు రెట్టింపు సంఖ్యలో రైతులు వచ్చారు. దీంతో పోలీసులు వారికి వరుస క్రమంలో నిలుచోబెట్టి యూరియా పంపిణీ చేయించారు. మిగిలిన 200 మంది రైతులకు టోకెన్లు ఇచ్చి, మంగళవారం ఇస్తామని చెప్పి పంపించేశారు.

● నారాయణపేట సింగిల్ విండో కార్యాలయం వద్ద యూరియా కోసం రైతులు ఎగబడటంతో కొంత గందరగోళం నెలకొన్నది. పోలీసులు రంగ ప్రవేశం చేసి వారికి నచ్చచెప్పి యూరియా పంపిణీ చేయించారు. యూరియా అయిపోవడంతో మిగిలిన 50 మందికి మంగళవారం ఇస్తామని చెప్పి పంపించేశారు.


● వనపర్తి జిల్లా, గోపాల్‌పేట మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయం వద్దకు సోమవారం ఉదయమే అధిక సంఖ్యలో రైతులు వచ్చి క్యూలో నిలుచున్నారు. 10 గంటల తర్వాత పీఏసీఎస్ అధికారులు, సిబ్బంది కార్యాలయానికి వచ్చారు. యూరియా అందుబాటులో లేదని చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

● వనపర్తి జిల్లా, ఆత్మకూరు పట్టణంలోని సహకార కేంద్రంలో శనివారం టోకెన్లు తీసుకున్న రైతులు సోమవారం ఉదయం 7 గంటలకే అక్కడికి చేరుకున్నారు. చెప్పులు, పాసుబుక్కులు క్యూలైన్లలో పెట్టి నిరీక్షించారు. సాయంత్రం రెండు లారీల్లో 600 బస్తాల యూరియా వచ్చింది. ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున 300 మందికి యూరియా పంపిణీ చేశారు.

అమరచింత మండలంలోని జూరాల ప్రాజెక్టు క్రాస్ రోడ్ వద్ద నున్న ఎరువుల విక్రయ కేంద్రం వద్దకు రైతులు సోమవారం తెల్లవారుజామునే చేరుకున్నారు. చెప్పులను క్యూలైన్లో ఉంచి వేచి ఉన్నారు. తీరా యరియా రాకపోవడంతో కేంద్రం సిబ్బంది 150 మంది రైతులకు టోకెన్లు ఇచ్చారు. మంగళవారం ఆగ్రో రైతు సేవా కేంద్రానికి రావాలని చెప్పి పంపించేశారు.



నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తాలో యూరియా కోసం రెండు ఫర్టిలైజర్ షాపుల ముందు బారులుగా నిలుచున్న రైతులు



ధన్వాడ సింగిల్ విండో దగ్గర పోలీస్ పహరా మధ్య బారులు తీరిన రైతులు

నిరంతరాయంగా జల విద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూరు, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి) : ఎగువ నుంచి ఆశించిన మేర వరద వస్తున్నందున జూరాల ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లో 12 యూనిట్ల ద్వారా నిరంతరాయంగా విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తున్నట్లు ఎస్ఈ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎగువ కేంద్రంలో ఆరు యూనిట్ల ద్వారా 3.374 మిలియన్ యూనిట్ల విద్యుత్ కాగా, ఇప్పటివరకు మొత్తం 269.017 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసినట్లు తెలిపారు. దిగువ కేంద్రంలో 6 యూనిట్ల ద్వారా ఇప్పటి వరకు 296.310 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసినట్లు తెలిపారు.

ఎగువ నుంచి వరద ఇదే స్థాయిలో కొనసాగితే, నిర్దేశించిన లక్ష్యాన్ని తొందరలోనే చేరుకునే అవకాశం ఉందని తెలిపారు.

కంపెనీలు, ఆర్గనైజర్లపై చర్యలు తీసుకోవాలి

- విత్తన పత్తి రైతులను ఆదుకోవాలి
- ఎన్‌హెచ్‌పీఎస్ జిల్లా చైర్మన్ రంజిత్ కుమార్

గద్వాల టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రైతు కమిషన్‌ను తప్పుదోవ పట్టించిన కంపెనీలు, ఆర్గనైజర్లపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి (ఎన్‌హెచ్‌పీఎస్) జిల్లా చైర్మన్ రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. విత్తన పత్తి సాగుచేసే రైతులకు అడుగడుగునా జరుగుతున్న మోసాలు, అన్యాయాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని సమితి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు కమిషన్ జిల్లా పర్యటన సందర్భంగా 80 శాతం జనరిక్ ప్యూరిటీ ఉన్న విత్తనాలకు పేమెంట్ పూర్తి చేశామంటూ కమిషన్‌ను తప్పుదోవ పట్టించారన్నారు. ఈ ఏడాది కొంత మంది రైతుల పేర్లతో విత్తనాలు ఫెయిల్ అయ్యాయంటూ ఏకపక్షంగా జాబితాను ఇస్తూ ఆర్గనైజర్లు, కంపెనీలు కొత్తరకం మోసానికి తెర తీశారని ఆరోపించారు. రైతులకు ఇంత అన్యాయం జరుగుతున్నా, పాలకులు కంపెనీలు, ఆర్గనైజర్ల తరఫున వకాల్తా పుచుకొని మాట్లాడుతుండటం దౌర్భాగ్యమన్నారు. రైతులకు న్యాయం చేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సమితి జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, నాయకులు బలరాంనాయుడు, వెంకటరాముడు, లక్ష్మన్న, నేతన్న, రాజు, శివప్ప పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల్లో అక్రమాలు

- ఖానాపూర్ గ్రామస్థుల ధర్నా



పేట కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఖానాపూర్ గ్రామస్థులు

నారాయణపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నారాయణపేట జిల్లా, మక్తల్ మండలం ఖానాపూర్ గ్రామస్థులు సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడిన పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, బీపీఎంలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూలీలతో ఫీల్డ్ అసిస్టెంట్ దురుసుగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

న్యూస్ బాక్స్

చెత్తాచెదారం తొలగింపు

వడ్డేపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వడ్డేపల్లి మునిసిపాలిటీ పరిధిలోని రామచంద్రానగర్ కాలనీ కుర్వ సంఘం భవనం వెనకాల రోడ్డులో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని సోమవారం పారిశుధ్య సిబ్బంది తొలగించారని బీజేపీ మండల అధ్యక్షుడు బోయ రామకృష్ణ తెలిపారు. ఈవిషయమై కమిషనర్‌కు తెలియజేయగా తక్షణమే స్పందించి చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేయాలని పారిశుధ్య కార్మికులను ఆదేశించారు. ఈమేరకు కార్మికులు కాలనీలో చెత్తను తొలగించి బ్లీచింగ్ వేసి శుభ్రం చేయడంతో ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రత్యేక అవసరాల చిన్నారులకు ఉపకరణాలు

గద్వాలసర్కిల్, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రత్యేక అవసరాల చిన్నారులకు ఉపకరాణాల ఎంపిక శిబిరం ఈనెల 3న గద్వాలలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి డీఈవో అబ్దుల్ ఘని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిబిరానికి చిన్నారులను తీసుకొచ్చే తల్లిదండ్రులు తమ పిల్లలు దివ్యాంగత్వం కలిగిన రెండు పాస్‌పోర్ట్ సైజ్‌ఫొటోలు, 40శాతం కన్నా ఎక్కువగా ఉన్నట్లు సదరం ధ్రువపత్రం/ప్రభుత్వ వైద్యుడు జారీ చేసిన ధ్రువపత్రం, ఆదాయం/రేషన్, ఆధార్‌కార్డులతో హాజరు కావాలని వివరించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న మాజీ సర్పంచ్ వరలక్ష్మి వెంకటస్వామి

గట్టు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాచర్లలో వినాయక చవితి సందర్భంగా రుక్మిణీ పాండు రంగస్వామి యూత్ ఆధ్వర్యంలో సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతిని పావని పరిమళ, రెండో బహుమతిని శ్రావణి, మూడో బహుమతిని శృతి గెలుపొందారు. తట్టే సీతారాములు, శాస్త్రీ పాండురంగ, గణేష్ యూత్ సప్లయర్ జంబన్న బహుమతుల దాతలుగా వ్యవహరించారు. బహుమతులను మాచర్ల మాజీ సర్పంచు వరలక్ష్మీ అందచేశారు. కార్యక్రమంలో యశోదమ్మ, శ్రీనివాసులు, పరమేశ్ పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ క్షమాపణలు చెప్పాలి

● బీజేపీ మండల అధ్యక్షుడు షేక్‌అబ్దుల్లా

ఇటిక్యాల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ప్రధాని నరేంద్ర మోదీకి క్షమాపణ చెప్పాలని బీజేపీ మండల అధ్యక్షుడు షేక్‌అబ్దుల్లా ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తంచేశారు. బీహార్ రాష్ట్ర పర్యటనలో భాగంగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, దేశప్రధాని మోదీ మాతృమూర్తిపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధుసూదన్‌గౌడ్, కిషోర్ ఉన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



తహసీల్దార్ రామ్మోహన్‌కు వినతిపత్రం ఇస్తున్న కేవీపీఎస్ నాయకులు, నిరుపేదలు

రాజోలి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని కోరుతూ కేవీపీఎస్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం రాజోలి తహసీల్దార్ రామ్మోహన్‌కు నిరుపేదలు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కేవీపీఎస్ మండల కార్యదర్శి విజయ్ కుమార్ మాట్లాడుతూ.. రాజోలి మండలంలో కనీసం ఇళ్లస్థలాలులేని నిరుపేద కుటుంబాలు వందల సంఖ్యలోఉన్నాయని, రెక్కాడితేగాని డొక్కాడని పేదలకు ఇళ్లు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించి అర్హులైన నిరుపేదలందరికి ఇళ్లస్థలాలు ఇచ్చి, ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఆయన వినతి పత్రం ద్వారా కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు ఆనందం, దేవరాజు, షేక్ షరీఫ్ పాల్గొన్నారు.

పురాతన బావిని శుభ్రం చేసిన యువకులు



గట్టులోని శేశంబావిని శుభ్రం చేస్తున్న యువకులు

గట్టు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పురాతన బావిని గ్రామ యువకులు శుభ్రం చేశారు. మాత అంబాభవాని ఆలయ సమీపంలో ఉన్న శేశంబావి కొంత కాలంగా అపరిశుభ్రంగా తయారై చెత్తాచెదారంతో నిండి నీరంతా నాచుతో పేరుకపోయింది. నీరంతా నల్లగా మారి అపరిశుభ్రంగా మారిన విషయాన్ని గుర్తించిన గ్రామ యువకులు కొందరు, మోటార్లతో నీటిని బయటికి తోడారు. ఈ సందర్భంగా వారిని గ్రామస్థులు అభినందించారు.

ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయొద్దు

● ప్రజావాణిలో అధికారులను ఆదేశించిన కలెక్టర్, ఎస్పీ ● కలెక్టరేట్‌లో 46, జిల్లా పోలీస్ కార్యాలయానికి 10 ఫిర్యాదులు



ఫిర్యాదులతో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్



మహిళ సమస్యను తెలుసుకుంటున్న ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాలన్యూటౌన్, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 46 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు ఉన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

గద్వాల క్రైం : ప్రజావాణిలో బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి వాటి పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి కృషి చేస్తామని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 10 ఫిర్యాదులు రాగా నేరుగా ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి వినతులు, ఫిర్యాదులు స్వీకరించి అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఫిర్యాదులలో ముఖ్యంగా కొడుకు తల్లిని చూసుకోకపోవడంపై ఒకటి, భర్తల వేధింపులకు సంబంధించి రెండు, భూ వివాదాలపై రెండు, గొడవలకు సంబంధించి ఒకటి, ప్లాట్‌కు సంబంధించి రెండు, ఇతర అంశాలకు సంబంధించి రెండు ఫిర్యాదులు అందాయని తెలిపారు.

ఘనంగా వినాయకుడి శోభాయాత్ర



వినాయక విగ్రహాలతో ఊరేగింపుగా వెళ్తున్న చిన్నారులు, మహిళలు

రాజోలి, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ భ్రమరాంబిక అడివేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసి 101వినాయక విగ్రహాలకు సోమవారం ఘనంగా నిమజ్జనం నిర్వహించారు. చిన్నారులు, మహిళలు, సాంప్రదాయ దుస్తులను ధరించి, చేతిలో వినాయక విగ్రహాలను పట్టుకుని గ్రామ పురవీధుల్లో శోభాయాత్రగా బయలుదేరారు. ముందుగా 101వినాయకులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తుంగభద్ర నదిలో నిమజ్జనం కార్యక్రమం పూర్తి చేశారు.

కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అదేవిధంగా గ్రామంలోని చిన్నబజారులో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో సాయంత్రం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సుదర్శన్‌రెడ్డికి అవకాశం కల్పించాలి

● పార్లమెంట్ సభ్యులకు ప్రజాసంఘాల వినతి

గద్వాల టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : దేశ ఉప రాష్ట్రపతిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి అవకాశం కల్పించాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈనెల 9న జరిగే ఉపరాష్ట్రపతి ఎన్నికలో పీడిత ప్రజల పక్షపాతి, నిష్కళంకుడు, మేధావి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి జిల్లాకు చెందిన పార్లమెంట్ సభ్యులు అండగా నిలవాలని కోరారు. సోమవారం పట్టణంలోని తెలంగాణ జనసమితి కార్యాలయంలో సమావేశమైన పలు ప్రజా, విద్యార్థి, ఉపాధ్యాయ, రైతు, కార్మిక సంఘాల నాయకులు, అరుదుగా లభించే ఇలాంటి అవకాశాలను ప్రజల అండతో ఎన్నికైన ప్రజాప్రతినిదులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి న్యాయమూర్తిగా ప్రజలకు అందించిన సేవలు., సామాజిక కోణంలో ఆయన ఇచ్చిన తీర్పులు, వ్యక్తిగత జీవనం తదితర అంశాల గురించి పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ ఇక్బాల్‌పాషా వివరించారు. కార్పొరేట్ వక్తులకు, ప్రజలకు మధ్య జరుగుతున్న ఘర్షణలో ప్రజల పక్షాన ముఖ్యంగా పీడిత వర్గాలకు అండగా ఉండే మనస్తత్వం గల సుదర్శన్‌రెడ్డికి అండగా నిలవాల్సిన అవసర ఉందని పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ బాబు కోరారు. సమావేశంలో నాగర్‌దొడ్డి వెంకట్రాములు, వెంకటేశ్, డి.ప్రభాకర్, మోహన్‌రావు, కృష్ణయ్య, నరసింహులు, కురువ పల్లయ్య, హనుమంతు, దౌలత్, ఇన్సాఫ్, సాదతుల్లా ఉన్నారు.

చిన్నారులను కూలీ పనులకు పంపొద్దు

- మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర రావు

కేటీదొడ్డి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి):బడిలో ఉండాల్సిన పిల్లలను కూలీ పనులకు పంపకూడదని మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర రావు అన్నారు. సోమవారం మండలంలోని పాగుంట, ముసల్‌దొడ్డి, వెంకటాపురం గ్రామాల్లోని పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరును పరిశీలించి విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడం వలన ఉపాధ్యాయులను తీసుకొని పత్తి పొలాల దగ్గరకు వెళ్లి పత్తి పొలాల్లో పని చేస్తున్న పదిమంది విద్యార్థులను పాఠశాలలో చేర్పించడం జరిగింది. విద్యార్థులను సీడ్ పత్తి పనులకు పంపిస్తే వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ యుగందర్, ఉపాధ్యాయులు రవి, రఘు, శ్వేత, సునీత పాల్గొన్నారు.

ఘనంగా ఎల్ఐసీ 69వ ఆవిర్భావ దినోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బంగి రంగారావు

● ల్యాంపు ఆవిష్కరణలో ఎల్ఐసీ బ్రాంచ్ కార్యదర్శి బంగి రంగారావు

గద్వాలన్యూటౌన్,సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): గద్వాల జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ కార్యాలయంలో ఎల్ఐసీ 69వ ఆవిర్భావ దినత్సోవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎల్ఐసీ బ్రాంచ్ కార్యదర్శి బంగి రంగారావు కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ల్యాంప్ ఆవిష్కరణ చేసి జెండా ఊపిర్యాలీని ప్రారంభించారు. ఈర్యాలీ పట్టణంలోని పాతబస్టాండ్, రాఘవేంద్రకాలనీ, కిష్టారెడ్డి బంగ్లా, గాంధీచౌక్ చేరుకొని అక్కడ గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రూ.ఐదుకోట్లతో ప్రారంభించిన ఎల్ఐసీ నేడు రూ.57లక్షల కోట్లు ఆస్తులు సంపాదించుకున్న ఏకైక సంస్థ ఎల్ఐసీ అని అన్నారు.

భారతదేశంలోనే కాకుండా ప్రపంచంలో మూడో స్థానంలో ఉన్నదన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ కులశేఖర్, ఎల్ఐసీ ఉద్యోగులు ఉన్నారు.

పునరావాస కేంద్రంలో డ్రైనేజీలు శుభ్రం చేయాలి



చిన్నోనిపల్లిలో పిచ్చి మొక్కలతో డ్రైనేజీ

గట్టు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నోనిపల్లి పునరావాస కేంద్రంలో నిర్మించిన డ్రైనేజీ కాలువలు పూర్తిగా అధ్వాన్నస్థితికి చేరాయని గ్రామస్థులు తెలిపారు. ఇసుక, మట్టి, పిచ్చిమొక్కలు మొలవడంతో వర్షం నీరు చేరి, నీరు ఎటూ పోకుండా నిలిచిపోతున్నదని తెలిపారు. చిన్నోనిపల్లి పునరావాస కేంద్రంలోని డ్రైనేజీ సమస్యపై సంబంధిత ఆర్‌అండ్‌ఆర్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. వర్షం నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయిందని, దోమలు, ఈగలు పెరుగుతున్నాయని తెలిపారు. అధికారులు స్పందించి, రోగాలు ప్రబలకముందే డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు.

పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు కృషి చేయాలి

● బీజేపీ జిల్లా ఇన్‌చార్జి డీకే స్నిగ్ధారెడ్డి



డీకే స్నిగ్ధారెడ్డి చేతులమీదుగా నియామకపత్రం అందుకుంటున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు

వడ్డేపల్లి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : గతంలో పార్టీ ఎదుగుదల కోసం కృషిచేసిన విధంగానే భవిష్యత్‌లోనూ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం పోరాడుతూ అధికారంలోకి తెచ్చేలా కృషి చేయాలని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి డీకే స్నిగ్ధారెడ్డి సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన మధుసూదన్‌గౌడ్‌కు డీకే స్నిగ్ధారెడ్డి నియామకపత్రం అందజేశారు. అనంతరం మధుసూదన్‌గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా ఉపాధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి, సీనియర్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, వడ్డేపల్లి మునిసిపాలిటీ అధ్యక్షుడు బోయ రామకృష్ణ, మండల అధ్యక్షుడు బోయ నాగరాజు, వడ్డేపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి బోయ వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

● ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నుషిత

గద్వాల టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు తెలంగాణ బీసీస్టడీ సర్కిల్ ద్వారా అందిస్తున్న ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కార్పొరేషన్ ఈడీ నుషిత సూచించారు. సోమవారం పట్టణంలోని తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్-1, 2, 3, 4, ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్ సర్వీసులకు చెందిన శిక్షణ తరగతులను ప్రారంభించారు. కార్యక్రమంలో మాట్లాడిన బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి అక్బర్ బాషా, ఐదునెలల పాటు అందించే ఫౌండేషన్ కోర్సుల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకతకు, విషయ పరిజ్ఞానానికి చక్కటి ప్రోత్సాహం లభిస్తుందన్నారు. స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.రాములు మాట్లాడుతూ తమ సర్కిల్ ద్వారా అందించే శిక్షణ ఐదు నెలల పాటు ఉచితంగా సాగుతుందన్నారు. నిష్ణాతులు, అనుభవజ్ఞులైన బోధకుల ఆధ్వర్యంలో ప్రణాళికాబద్ధంగా తరగతులను నిర్వహిస్తున్నట్లు వివరించారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

● ఎంఈవో రవీంద్రబాబు



ధరూర్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో రవీంద్రబాబు

ధరూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): టెక్నికల్ లర్నింగ్ మెథడ్స్‌ను (టీఎంఎం)ను ఉపయోగించి విద్యార్థులకు పాఠ్యాంశాలను అర్థమయ్యేలా బోధించాలని మండల విద్యాధికారి రవీంద్రబాబు ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం ధరూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు మాల్‌దొడ్డి, మీర్జాపూర్, పీఎస్ నీలహళ్లి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో సందర్శించారు. ఈ సందర్భంగా మాల్‌దొడ్డి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించి సూచనలు, సలహాలు చేశారు. మీర్జాపూర్ పీఎస్‌లో అభ్యసన సామర్థ్యను పరిశీలించారు. పీఎస్ నీలహళ్లిలో ఐదవ తరగతి విద్యార్థులచే చతుర్విధ ప్రక్రియను చేయించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూప్రకారం రుచికరంగా చేయాలని వంట నిర్వాహకులను ఆదేశించారు. అలాగే ధరూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. నాణ్యతతో అందించాలన్నారు.

నేడు ధరూర్‌లో బీఆర్ఎస్ ధర్నా

ధరూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం ప్రాజెక్టుపై అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీ చేసిన కుట్రలకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఈనెల 2వ తేదీ మంగళవారం ఉదయం 9గంటలకు ధరూర్ బైపాస్ వద్ద ధర్నా, నిరసన కార్యక్రమం చేపట్టినట్లు బీఆర్ఎస్ మండల నాయకులు రఘువర్ధన్‌రెడ్డి, రాజారెడ్డి, వెంకటేశ్‌నాయుడు, అబ్రహం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున బీఆర్ఎస్ పార్టీ ముఖ్యకార్యకర్తలు అందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలను గద్దెనెక్కిస్తాం



అలంపూరుచౌరస్తాలో సీఎం రేవంత్, రాహుల్‌గాంధీ, పీసీసీ చైర్మన్ మహేశ్‌గౌడు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, ఇతర ముఖ్య నాయకులు

● ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్

అలంపూరు చౌరస్తా, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల నుంచే బీసీలను గద్దెనెక్కిస్తామని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన కార్యకర్తలతో కలిసి అలంపూరు చౌరస్తాలో సీఎం రేవంత్, రాహుల్‌గాంధీ, పీసీసీ చైర్మన్ మహేశ్‌గౌడ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఉండవల్లి మండల అధ్యక్షుడు గోపాల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి భారీగా కార్యకర్తలు హాజరయ్యారు. గత ప్రభుత్వాలు బీసీలను ఓట్లకోసమే వాడుకున్నారని, బడుగుబలహీన వర్గాల కోసం రాహుల్‌గాంధీ తీసుకున్న నిర్ణయం ప్రకారం కులగణన చేసి బీసీల శాతానికి అనుగుణంగా రిజర్వేషన్లు అమలు చేసేందుకు అసెంబ్లీలో తీర్మానం చేసి బిల్లు పాస్ చేయించామన్నారు. దీనివల్ల భవిష్యత్‌లో బీసీలకు విద్య, ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు. ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతారని అన్నారు. ఎస్సీలను కూడా ఏబీసీడీ వర్గీకరణ కూడా చేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు గ్రంథాలయ చైర్మన్ నీలిశ్రీనివాసులు, అలంపూరు మాజీ జడ్పీటీసీ క్యాతూరు మద్దిలేటి, దొడ్డెప్ప, బైరపురం రమణ, కృష్ణయ్య, శేరుపల్లి నాయుడు, షేక్షవలి ఆచారి, పరమేశ్, బొంకూరు దస్తగిరి, వెంకటేశ్‌యాదవ్, జగన్ మోహన్‌నాయుడు, కొర్విపాడు మధు, శ్రీకాంత్, పల్లిసతీశ్‌రెడ్డి, రాము, నరసింహ ఉన్నారు.

బీసీ రిజర్వేషన్ల పెంపు చారిత్రక నిర్ణయం

గద్వాలటౌన్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ తెలంగాణ అసెంబ్లీ చేసిన ఏకగ్రీవ తీర్మానం చారిత్రాత్మకమైందని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపును హర్షిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం సాయంత్రం పట్టణంలోని కృష్ణవేణి సర్కిల్‌లో పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండీ ఇసాక్, జిల్లా గ్రంథాలయం చైర్మన్ నీలి శ్రీనివాస్, నాయకులు లత్తిపురం వెంకట్రామిరెడ్డి, నల్లారెడ్డి, శంకర్, షేక్షావలి ఆచారి, రాజశేఖర్ రెడ్డి, మ్యాడం రామకృష్ణ, మాల శ్రీనివాస్, ఎల్లప్ప, భాస్కర్ యాదవ్, రవి, కరాటే సత్యం, రాము ఉన్నారు.

సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలి



కలెక్టరేట్‌లో నిరసన తెలుపుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం నాయకులు

● జేఏసీ చైర్మన్ నాగార్జునగౌడు

గద్వాలన్యూటౌన్, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): సీపీఎస్ రద్దుచేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని జేఏసీ చైర్మన్ నాగార్జునగౌడు అన్నారు. సోమవారం గద్వాల జిల్లాలో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ టీజేఈజేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రాంగణంలో సీపీఎస్ విధానానికి వ్యతిరేకంగా ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల భాగస్వామ్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. పెన్షన్ అనేది ఉద్యోగుల హక్కు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పిన విధంగా సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని కోరారు.

అనంతరం అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఎస్ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, హాస్టల్ వార్డెన్ సుజాత, బీజాపూర్ ఆనంద్, భీమన్న, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం నాయకులు రమేశ్, గోపాల్, రమేష్, లక్ష్మన్న, బుచ్చన్న, ఈశ్వర్, రామన్‌గౌడు, ఖాజామీర్, లక్ష్మీనారాయణ, నాగేశ్, రాజేశ్ ఉన్నారు.

యూరియా కోసం రైతులకు తప్పని తిప్పలు



శాంతినగర్ సొసైటీ వద్ద రైతులతో మాట్లాడుతున్న ఎస్ఐ నాగశేఖర్ రెడ్డి

వడ్డేపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గత నాలుగైదు రోజులుగా యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సోమవారం శాంతినగర్ సహకార సొసైటీ దగ్గర యూరియా కోసం రైతులు గొడవ పడుతుండటంతో శాంతినగర్ ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డి అక్కడి చేరుకుని రైతులతో మాట్లాడి ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా పంపిణీ చేయించారు. రెండు సంచుల యూరియా కోసం పనులు వదులుకుని ఉదయం నుంచి సాయంకాలం వరకు పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. క్యూలైన్‌లో నిలబడి యూరియా తీసుకోవాలంటా చాలా ఇబ్బందులు పడుతున్నామని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం రైతుల ఇబ్బందులను గమనించి తక్షణమే పూర్తిస్థాయిలో సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు. నాలుగు ఎకరాల పొలానికి రెండు సంచుల యూరియా ఎలా వేయాలని రైతులు అంటున్నారు. పది ఎకరాలకు పాస్‌బుక్కు ఉన్న రెండు సంచులు ఇస్తే ఎలా అని ప్రశ్నించారు. పొలాన్ని బట్టి యూరియా ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

ఐఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా సంగాల అయ్యపురెడ్డి



జిల్లా అధ్యక్షుడు సంగాల అయ్యపురెడ్డిని సన్మానిస్తున్న ఐఆర్ఎస్ పాలక సభ్యులు

గద్వాలన్యూటౌన్,సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా పాలకమండలి సభ్యుల ఎన్నిక, ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని సోమవారం జిల్లా కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా సంగాల అయ్యపురెడ్డి, ఉపాధ్యక్షుడుగా తాహిర్, కోశాధికారిగా ధనలక్ష్మి, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులుగా రమేశ్ ఎన్నికయ్యారు. జిల్లా కార్యనిర్వాహక సభ్యులుగా అప్సర్‌పాష, కరాటే శ్రీహరి, చాగాపురం లక్ష్మీనారాయణగౌడు, పాల్ సుధాకర్, రవికుమార్, గంగాధర్‌గౌడు, జయరామయ్య, మోహన్‌రావు, అక్బర్‌బాష, నల్లారెడ్డి ఎన్నికయ్యారు.

పోలీసు అధికారి కుటుంబానికి కార్పస్ ఫండ్ అందజేత

గద్వాల క్రైం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మరణించిన పోలీసు అధికారి కుటుంబ సభ్యులకు ఎస్పీ శ్రీనివాసరావు సోమవారం విడో కార్పస్ ఫండ్ చెక్కు అందజేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గల పోలీస్ కంట్రోల్ రూమ్ విభాగంలో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఎం.ఏ. సమీద్ ఈఏడాది మే 18న జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించగా వారి కుమారుడికి ఎస్పీ విడో కార్పస్ ఫండ్ కింద రూ.లక్ష చెక్కును అందజేశారు. విధి నిర్వహణలో మరణించిన పోలీసు కుటుంబాలకు అన్నివేళలా అండగా ఉంటూ, వారి సంక్షేమానికి కృషి చేస్తామని ఎస్పీ అన్నారు.

కార్యక్రమంలో కార్యాలయ ఏవో సతీశ్, సూపరింటెండెంట్ నాగమణి, ఎం.ఏ సమీద్‌భార్య సజిదా సుల్తాన్, కుమారుడు ఉన్నాడు.

బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి

● నిమజ్జన వేడుకల్లో గాయపడిన వారిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే అబ్రహాం



కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే అబ్రహాం

అలంపూరు చౌరస్తా, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇటిక్యాల మండల కేంద్రానికి చెందిన యువకులు వినాయక నిమజ్జనానికి వెళ్తూ గాయపడ్డవారిని మాజీ ఎమ్మెల్యే అబ్రహం పరామర్శించారు. ఎర్రవల్లి మండలం, కొట్టం కాలేజీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, పలువురు గాయపడిన సంగతి తెలిసిందే. గాయపడ్డవారిని కర్నూలు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అబ్రహాం సోమవారం ఆసుపత్రికి వెళ్లి మెరుగైన వైద్యం అందించాలని అక్కడి వైద్యులను కోరారు.